క్లుప్తంగా

నిరాశ్రయులకు ఉచిత హెయిర్ కటింగ్



అభాగ్యులకు కటింగ్ చేస్తున్న ఆర్కే సోషల్ సర్వీస్ ప్రతినిధులు

సీతమ్మధార: ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం, ఆర్కే సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో జీవీఎంసీ, ఏయూటీడీ స్వచ్ఛంద సంస్థ భీంనగర్ నిరాశ్రయుల వసతి గృహంలో ఉన్న 16 మందికి ఉచిత హెయిర్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.రాధాకృష్ణ, ఎం.శ్రీను, డి.రవి, ప్రవీణ్‌కుమార్, ఏయూటీడీ సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు, మేనేజర్ భాస్కరరావు పాల్గొన్నారు.

17న ఎరుకుమాంబ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఎరుకుమాంబ అమ్మవారు

సీతమ్మధార: ఈనెల 17వ తేదీన దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో రమాబాయి తెలిపారు. ఉదయం 6 గంటలకు గణపతి పూజ, పంచామృతాభిషేకం, అమ్మవారికి ప్రాతఃకాల అర్చనలు, 8 గంటలకు శ్రీలక్ష్మీ గణపతి హోమం, అనంతరం అన్నకుంభరాశి పూజలు నిర్వహిస్తామని తెలిపారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం జరుగుతుందని పేర్కొన్నారు.

కోతి హల్‌చల్.. ప్రజల బెంబేలు



రహదారిపై పరుగులు తీస్తున్న కోతి

సీతమ్మధార: మంగళవారం కోతి హల్‌చల్ చేసింది. దీంతో ప్రజలు పరుగులు తీశారు. జీవీఎంసీ ప్రాంతంలో ఒక కోతి నానా హంగామా సృష్టించింది. రోడ్డుపై వెళ్తున్న మహిళలు, చిన్నారులను తరుముతూ అది రావడంతో పరుగులు తీశారు. పాదచారుల వద్దకు వచ్చి చేతుల్లోని బ్యాగులు తీసుకునేందుకు ప్రయత్నించింది. దీంతో అందరూ భయపడిపోయారు. అలాగే జీవీఎంసీ కార్యాలయం ఆవరణలో ఉన్న కార్లపై ఎక్కి సందడి చేసింది.

ఆకట్టుకున్న త్యాగరాయ కృతులు



త్యాగరాజ కృతులు ఆలపిస్తున్న విద్యార్థులు

సీతంపేట : సెంటర్ ఫర్ సైకాలజీ ఆఫ్ మ్యూజిక్ అండ్ మ్యూజిక్ థెరపీ సంస్థ ద్వారా ఆన్‌లైన్‌లో శాస్త్రీయ సంగీతం నేర్చుకున్న విద్యార్థులు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మంగళవారం కచేరీ నిర్వహించారు. విద్యార్థులు తాము నేర్చుకున్న త్యాగరాజ, ముత్తుస్వామి, శ్యామశాస్త్రి కృతులను మృధు మధురమైన కంఠంతో ఆలపించి అలరించారు.

అలరించిన సంగీత విభావరి

సీతంపేట : ఎస్పీబీ స్వరాభిషేకం ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. పల్లా బాబ్జీ, రంజిత, వెంకట్, స్వరూప, విశ్వప్రసాద్, కోమలి, శివనారాయణ, హర్షప్రియ, ఎల్.వెంకటేష్, స్వరూప, బొమ్మిడి సత్యనారాయణ, మాధురి పాటలతో ప్రేక్షకులను అలరించారు. కళా సంస్థల ప్రతినిధులు చెన్నా తిరుమలరావు, కొణతాల రాజు, ఎంపీ రాజశేఖర్, మహమ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

వేగానికి ఏదీ కళ్లెం?



ప్రమాదకరంగా జ్ఞానాపురం ఎఫ్‌సీఐ గిడ్డంగి రహదారి

స్పీడ్‌బ్రేకర్లు లేక వాహనాల వేగానికి కళ్లెం పడటంలేదు. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు రోడ్డు దాటాలంటే నానా అవస్థలు పడుతున్నారు. జ్ఞానాపురం, కాన్వెంట్ జంక్షన్ పరిధిలోకి వచ్చే పలు రోడ్లలో ద్విచక్ర వాహనాలతో పాటు భారీ వాహనాలు కూడా అత్యంత వేగంగా ప్రయాణిస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. వాహనాల వేగానికి కళ్లెం వేసేలా అవసరమైన చోట స్పీడ్‌బ్రేకర్లు వేయాలని ప్రజలు అధికారులకు **మొర పెట్టుకుంటున్నా** స్పందన లేదని **వాపోతున్నారు.**

- స్పీడ్‌బ్రేకర్లు లేక దూసుకుపోతున్న **వాహనాలు**
- విద్యార్థులు, ఉద్యోగుల **అవస్థలు**
- జంక్షన్‌లో తరచూ **ప్రమాదాలు**



ప్రమాదభరితంగా కాన్వెంట్ కూడలి నుంచి జ్ఞానాపురం వెళ్లే సబ్‌వే రహదారి

కంచరపాలెం: జ్ఞానాపురంలోని కాన్వెంట్ కూడలి నుంచి అటు నగరంలోకి ఇటు సింహాచలం, గాజువాక వెళ్లే మార్గాలు ప్రయాణికులను కలవరపెడుతున్నాయి. ఈ రోడ్లలో వాహనాలు అతివేగంగా ప్రయాణిస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. **తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు ప్రధాన ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు, ట్రాఫిక్ ఔట్‌పోస్టుల నిర్మాణం చేపట్టకపోవడం పట్ల ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాన్వెంట్ కూడలి కారిడార్‌లో భాగంగా కంచరపాలెం వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్డును** మూడులైన్లుగా విస్తరించారు. కంచరపాలెం నేతాజీ వంతెన వరకు మూడు కిలోమీటర్లు ఉండే ఈ మార్గంలో వాహనాలు అత్యంత వేగంగా ప్రయాణిస్తుంటాయి. కంచరపాలెం మీదుగా జ్ఞానాపురం రైల్వేస్టేషన్‌కు చాలా మంది ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. జ్ఞానాపురం కూడలి నుంచి కంచరపాలెం వెళ్లేమార్గంలో సెయింట్ జోసెఫ్ విద్యాసంస్థలు, సేక్రెడ్‌హార్ట్ బాలికోన్నత పాఠశాల, ఆర్‌సీఎం విద్యా సంస్థలు, సోఫియా జూనియర్ కళాశాల, **సెయింట్ మేరీస్ డీఈడీ, బీఈడీ ఎడ్యుకేషన్ విద్యా సంస్థలతో పాటు జోన్–5 జోనల్ కార్యాలయం, వార్డు సచివాలయాలు, జ్ఞానాపురం రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు, విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు, స్థానిక పాదచారులు వాహనాల వేగానికి అదుపు లేకపో**వడంతో హడలిపోతున్నారు. **రోడ్లు దాటడానికే** కాదు రోడ్డు పక్క **నుంచి నడవాలన్నా, రాకపో**కలు సాగించాలన్నా **అసంపూర్తి ఫుట్‌పాత్‌లతో** భయపడుతున్నామని **చెబుతున్నారు.**



ప్రజలను కలవరపెడుతున్న కాన్వెంట్ కూడలి

హోల్‌సేల్ మార్కెట్‌కు వచ్చే భారీ వాహనాలతో ఇక్కట్లు..

కాన్వెంట్ కూడలిలో గల హోల్‌సేల్ మార్కెట్‌కు వచ్చే భారీ వాహనాలు కూడలిలో పెట్టి వ్యాపారాలు చేయడంతో కూడలి రహదారి వేకువ జాము నుంచి ట్రాఫిక్‌మయంగా మారుతుంది. ద్విచక్ర వాహనాల వేగానికి కూడలిలో నిత్యం ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకుంటుంది. జీవీఎంసీ జోన్–5 ఇంజినీరింగ్ అధికారులు కావలసిన చోట బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డు (సబ్ వే)లో స్పీడ్ బ్రేకర్లు వేయాలని వినతులు అందించినా స్పందించడం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా హార్బర్ పోలీసు స్టేషన్–కంచరపాలెం పోలీసు స్టేషన్ల పరిధిలో వాహనాల వేగానికి కళ్లెం వేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డు దాటాలంటే భయంగా ఉంది..

కళాశాలకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. ద్విచక్ర వాహనాల నుంచి భారీ వాహనాలు వరకు వేగంగా వస్తుంటాయి. చిన్న పిల్లలు మరీ ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి సమయంలో రోడ్డు దాటాలంటేనే భయంగా ఉంటుంది. స్పీడ్ బ్రేకర్లు వేస్తే వేగానికి కొంత వరకు కళ్లెం పడుతుంది. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– జి. వెంకటలక్ష్మి, ఇంటర్ విద్యార్థిని, సెయింట్ జోసెఫ్ కళాశాల



అధికారులు స్పందించాలి..

కాన్వెంట్ కూడలి 'వై'జంక్షన్‌లో ఉండడంతో అడ్డదిడ్డంగా వాహన చోదకులు వస్తుంటారు. కూడలిలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. హోల్‌సేల్ మార్కెట్ నుంచి కంచరపాలెం ఎఫ్‌సీఐ గిడ్డంగి వరకు సబ్‌వేలో నిత్యం వాహనాలు పార్కింగ్ చేస్తుంటారు. ప్రజలకు కావలసిన ప్రాంతాల్లో అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

–ఎస్. శ్యామ్ సుందరరావు, స్థానికుడు, జ్ఞానాపురం

ఆస్తి పన్ను వసూలు వేగవంతం కావాలి



మాట్లాడుతున్న డీసీఆర్ శ్రీనివాస్

జగదాంబ: ఆస్తి పన్ను వసూలు వేగవంతం కావాలని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ రెవెన్యూ ఎస్.శ్రీనివాస్ అన్నారు మంగళవారం ఆయన సూర్యాబాగ్ జోనల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సెక్రటరీలు,, ట్యాక్స్ కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల వారీగా ఆర్‌ఐలు, సిబ్బంది నిర్ణయించిన టార్గెట్లు తీసుకుని రెవెన్యూ వసూల్ చేసి జీవీఎంసీకి ఆదాయం పెంచాలన్నారు. పాతబకాయిలు, మొండి బకాయిదారులకు నోటీలు జారీ చేయాలన్నారు. అప్పటికీ చెల్లించని పక్షంలో ఆస్తి జప్తు నోటీసులు జారీ చేయాలన్నారు. అలాగే పన్ను చెల్లింపులు చేసే వారి నుంచి చెక్‌లు కాకుండా కమిషనర్ జీవీఎంసీ పేరుతో డీడీలు తీసుకోవాలన్నారు. గతంలో చెక్‌లు ఇచ్చి ఇప్పటికీ పన్నులు చెల్లించని వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. షాపింగ్ మాల్స్, కళాశాలలు, అపార్టుమెంట్లు, ఖాళీ స్థలాల నుంచి పన్ను వసూలు చేయాలన్నారు. అందరం కలిసి పనిచేస్తే పనులు సులభతరం అవుతాయని డీసీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంతో జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, ఆర్వోలు, ఆర్‌ఐలు తదతరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై టమాటా విక్రయాలు

సీతంపేట : కొండెక్కిన టమాట ధరలను నియంత్రించడానికి మార్కెటింగ్ శాఖ రైతుబజార్లలో సబ్సిడీపై విక్రయాలు ప్రారంభించింది. నరసింహనగర్ రైతుబజార్‌లో మంగళవారం కిలో రూ.50ల చొప్పున విక్రయించారు. హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో రూ.70, బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.80లు ధర పలుకుతోంది. 2 వేల కిలోల టమాటాలు సబ్సిడీపై విక్రయించినట్టు బజారు ఎస్టేట్ ఆఫీసర్ పి.చినబాబు తెలిపారు. రేషన్ కార్డు లేదా ఆధార్ కార్డు చూపించిన వారికి కిలో చొప్పున విక్రయించారు. బుధవారం కూడా విక్రయిస్తామని తెలిపారు.

పోర్ట్ ఆస్పత్రిని ప్రైవేట్‌పరం చేయొద్దు



మాట్లాడుతున్న నాయకులు

దాబాగార్డెన్స్: పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణ చర్యలు తక్షణమే నిలుపుదల చేసి పోర్టు సొంత నిధులతో అభివృద్ధి చేయాలని విశాఖపట్నం పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. జగదాంబ జంక్షన్ సమీపాన ఎస్పీఆర్ భవన్‌లో అఖిలపక్ష కార్మిక సంఘాలు సమావేశమయ్యాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి బీసీహెచ్ మసేన్, హెచ్ఎంఎస్ యూనియన్ నాయకుడు మంగయ్యనాయుడు, సిటు ఆర్గనైజింగ్ కార్యదర్శి వి. రామలింగేశ్వరరావు, వీడీఎల్‌బీ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జక్కన సత్యనారాయణ, సీఎఫ్‌టీయూఐ జాతీయ ప్రధాన కార్యదర్శి కె. కనకారావు మాట్లాడుతూ పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రి 150 పడకల సామర్థ్యంతో నిర్మించి ప్రస్తుతం 80 పడకలతో సమర్థవంతంగా పోర్టు అండ్ డాక్ అధికారులు, ఉద్యోగులు, రిటైర్ అయిన కార్మికులు, ఫ్యామిలీ పెన్షనర్లు, పూల్ కళాసీలు, సీహెచ్‌డీ క్యాజువల్ కార్మికులు, సీఐఎస్‌ఎఫ్ ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులకు దశాబ్దాల తరబడి 40 వేల కుటుంబాలకు సేవలందిస్తుందన్నారు. అటువంటి పోర్టు ఆస్పత్రిని పీపీపీ పద్ధతిలో మల్టీ డిసిప్లినరీ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిగా 300 పడకలతో ప్రైవేట్‌కు కట్టబెట్టాలనే నిర్ణయాన్ని పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఆస్పత్రి ప్రైవేట్‌పరం అయితే కార్మికులు, ఉద్యోగుల కుటుంబాలు ఆరోగ్య భద్రత కోల్పోవలసి ఉంటుందన్నారు. పోర్టుల్లో పీపీపీ/ఓటీటీ విధానాలు విఫలమయ్యాయని, గతంలో స్వయంగా కాగ్ మొట్టికాయలు వేసినా ప్రైవేట్ జపం చేయడం సరైంది కాదని దుయ్యబట్టారు. పీపీపీ పద్ధతిలో ప్రైవేట్‌కి ఇవ్వొద్దని, నిరంతరం లాభాలతో నడుస్తున్న విశాఖ పోర్టు సొంత నిధులతోనే పోర్టు ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని మాండ్ చేశారు.

మాతృ మరణాలు సంభవించరాదు



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లాలో మాతృ మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. మాతృ మరణాలపై మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం జూలై నుంచి సెప్టెంబర్ వరకు జిల్లాలో 4 మాతృ మరణాలు సంభవించాయని, వీటిలో రైల్వే న్యూకాలనీ పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో ఒకటి, స్వతంత్ర నగర్ పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో ఒకటి, బుచ్చిరాజుపాలెం పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో ఒకటి, దుర్గా బజార్ పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలో ఒకటి సంభవించాయన్నారు. గర్భిణులకు సమయానుకూలంగా వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించటం, పోషకాహారం తీసుకోవాలని అవగాహన కల్పించాలన్నారు. రక్తహీనత ఉంటే వారికి ఐరన్ ఫోలిక్ టాబ్లెట్లు ఇవ్వడం, హైరిస్క్ గర్భిణులను గుర్తించి డాక్టర్ల వద్దకు తీసుకెళ్లి వైద్యం అందేటట్లు చూడాలని తెలిపారు. గుండె జబ్బులు ఉన్నవారిని గుర్తించి వెంటనే రిఫరల్ ఆస్పత్రికి తరలించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఆస్పత్రి సమన్వయ అధికారి డాక్టర్ శంకర్ ప్రసాద్, వివిధ విభాగాల అధికారులు డాక్టర్ బి.ఉమావతి, కేజీహెచ్ గైనిక్ విభాగాధిపతి డాక్టర్ కె.వి.ఎస్.ఎం. సంధ్యాదేవి, గైనకాలజిస్ట్, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషా ప్రసాద్, వైద్యులు డాక్టర్ శ్రవణ్, డాక్టర్ జి.వి.గణేష్, డాక్టర్ సి.బి.నాయుడు, వివిధ విభాగాలకు చెందిన ఎస్.జయదేవి, ఐ.మనోరమ, 108 జిల్లా మేనేజర్ వి.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఈవోకు ఘనంగా వీడ్కోలు



జెడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయణను సత్కరిస్తున్న చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట: నిబద్ధతతో పని చేసే అధికారులకు ఎప్పుడు గుర్తింపు ఉంటుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అన్నారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో జిల్లా ప్రజా పరిషత్ డిప్యూటీ సీఈవోగా, సీఈ వో (ఇన్‌చార్జి)గా పనిచేసి శ్రీకాకుళం బదిలీ అయిన డి.సత్యనారాయణ వీడ్కోలు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండేళ్ల క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసి బదిలీపై ఆయన శ్రీకాకుళం జిల్లాకు వెళ్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆయనను సుభద్ర సత్కరించారు. రెండేళ్లలో తనకు అన్ని విధాల సహకరించిన సత్యనారాయణకు ధన్యవాదాలు తెలిపారు. పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్. సత్తిబాబు మాట్లాడుతూ ఉద్యోగుల పదోన్నతుల్లో, బదిలీల్లో, కారుణ్య నియామకాల్లో నిబంధనలకు లోబడి పని చేయడం సంతోషం కలిగించే విషయమన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా డీపీవో శ్రీనివాసరావు, ఉద్యోగ సంఘం నాయకులు మూర్తి, త్రినాథ్, మధు, రాధ, జిల్లా పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అల్లిపురం : టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి చావులమదుం దరి కులాస బార్ వద్ద మంగళవారం రాత్రి కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. టూటౌన్ ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం చావులమదుం జంక్షన్ వద్ద గల కులాస బార్ అండ్ రెస్టారెంట్ వద్ద కారు ఢీకొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని తెలిపారు. చనిపోయిన వ్యక్తి సుమారు 52 సంవత్సరాల వయస్సు కలిగి, మాసిన గెడ్డంతో ఉన్నాడన్నారు. సుమారు 5.6 అంగుళాల పొడవు, చామనఛాయ కలిగి ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించామన్నారు. ఆచూకీ తెలిసిన వారు 9440796041 నంబరులో తెలియజేయాలని ఆమె కోరారు.

కరుణించి కాపాడు.. దుర్గమ్మా



చండీదేవిగా దర్శనమిస్తున్న కన్యకాపరమేశ్వరి



వారాహిదేవికి పూజలు చేస్తున్న మహిళలు



మహాలక్ష్మీదేవిగా సాగరగిరి కనకదుర్గమ్మ



మహాలక్ష్మీదేవిగా ఉమాదేవి



అమ్మవారికి పూజలు చేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం అన్నపూర్ణాదేవిగా కన్యకాపరమేశ్వరి భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థాన ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమారశర్మచే సామూహిక కైలాస గౌరీ పూజ నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో వాసవీ స్నేహాలయం, కొల్లూరి విశాల బృందంచే మణిద్వీప వర్ణన పారాయణ భక్తులను ఆకట్టుకుంది. కన్యకాపరమేశ్వరి బుధవారం సరస్వతీదేవిగా దర్శనమివ్వనున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్లు కరిమిశెట్టి వెంకటరమణ, వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, పూసర్ల సంజీవి, దేవాలయ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, కోశాధికారి దోమ వెంకట బాలాజీకుమార్, ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహా సరస్వతీదేవిగా దుర్గాలమ్మ..

నగరంలోని 35వ వార్డు పూర్ణామార్కెట్ వెలంపేటలో వెలసిన దుర్గాదేవి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ఆరో రోజుకి చేరాయి. అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. భవనామాల ధార భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. బుధవారం మహాలక్ష్మీదేవిగా దుర్గాలమ్మ దర్శనమివ్వనున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. నవరాత్రుల పూజ చేయించుకునే భక్తులు, వారి గోత్ర నామాలు తెలిపి దేవస్థానంలో ముందుగా రూ.200 పూజా రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

మహాలక్ష్మీదేవిగా కనకదుర్గమ్మ..

అల్లిపురం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దుర్గాదేవి అమ్మవారు భక్తులకు మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో అమ్మవారి దేవాలయాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. యారాడ కొండపై వెలసిన సాగర గిరి కనక దుర్గమ్మ దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ అర్చకుడు ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు.

మహాలక్ష్మీదేవిగా ఉమాదేవి..

టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన ఉమాదేవి అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు భార్గవ శర్మ అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

అమ్మవారి కరుణ అందరిపై ఉండాలి..

దుర్గమ్మ కరుణా కటాక్షాలు అందరిపై ఉండాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆకాంక్షించారు. 33వ వార్డులో పార్టీ సభ్యుడు బూర్లె చిన్న, అరుణ దంపతుల ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన అన్న సమారాధనకు ఆయన ఆహ్వానితులుగా విచ్చేసి ముందుగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గత 16 సంవత్సరాలుగా భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న చిన్నా, అరుణ దంపతులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగులను వేధిస్తున్న అధికారిపై చర్యలు తీసుకోవాలి

మహారాణిపేట: సచివాలయ ఉద్యోగులను తీవ్రంగా వేధిస్తూ, వ్యక్తిగత దూషణకు పాల్పడుతున్న విజయనగరం మున్సిపల్ కమిషనర్ నల్లనయ్యపై చర్యలు తీసుకోవాలని విశాఖపట్నం జిల్లా వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎం.ఆనందరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జె.గణేష్‌కుమార్ డిమాండ్ చేశారు. నల్లనయ్య గత కొద్ది రోజుల నుంచి సచివాలయ ఉద్యోగులను తీవ్రంగా వేధిస్తూ, అవమాన పరుస్తూ హేళన చేస్తున్నారని గణేష్‌కుమార్ అన్నారు. అలాగే మీకంటే హిజ్రాలు నయం, వాళ్లు బాగా కలెక్ట్ చేస్తారని, బాగా పని చేస్తారంటూ మాట్లాడుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఉద్యోగులకు అండగా నిలబడతామని గణేష్‌కుమార్ అన్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో సచివాలయ ఉద్యోగులకు తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామన్నారు. రాష్ట్ర ట్రెజరర్ చింతకాయల బంగారురాజు, విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎన్వీ సందీప్, నాయకులు బీవీ అశోక్‌కుమార్, ఎస్. సాయికృష్ణ, శరణ్య, సిద్ధార్థ వర్మ తదితరులు సంఘీభావం ప్రకటించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఆరిలోవ: సీజనల్ వ్యాధులపై ఆర్ఎంపీలకు అవగాహన కల్పించారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో హెల్త్ సిటీ జీజే ఆస్పత్రిలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. తరచూ వచ్చే వ్యాధులు, ఎముకలు, కీళ్లు, నరాలలో సంభవించే వ్యాధులపై ఆర్ఎంపీ వైద్యులకు అవగాహన కల్పించారు. ప్రజలను ఆయా వ్యాధుల పట్ల అప్రమత్తం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ వైద్యుడు శివాజీ ప్రసాద్, న్యూరో ఫిజీషియన్ డాక్టర్ మౌనిక, గ్రామీణ వైద్యుల సంఘం ప్రతినిధులు జంగం జోషి, కనకరావు పాల్గొన్నారు.

యూజీడీలకు మరమ్మతు చేయాలి



యూజీడీ నుంచి బయటికి వస్తున్న మురుగును పరిశీలిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: జోన్–4 పరిధిలో మరమ్మతులకు గురైన యూజీడీలను వెంటనే బాగు చేయాలని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. మంగళవారం ఆయన 35వ వార్డు నూనెమిల్లువీధిలో మరమ్మతులకు గురైన యూజీడీని పరిశీలించారు. ఈ సందర్భంగా కొన్ని నెలలుగా యూజీడీ నుంచి మురుగు నీరు బయటికి ప్రవహిస్తుందని స్థానికులు తెలిపారు. దీంతో దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. జీవీఎంసీకి అనేక సార్లు ఫిర్యాదు చేసినప్పటికీ సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోవడంలేదని ఫిర్యాదు చేశారు. దీనిపై జెడ్సీ మాట్లాడుతూ వార్డులో నూనెమిల్లువీధితో పాటు వార్డులో బౌడారారోడ్డు, 75 ఫీట్ రోడ్డు, వెలంపేట, గాజుల వీధి ప్రాంతాల్లో యూజీడీలు అన్ని అస్థవ్యస్తంగా ఉన్నాయన్నారు. వాటికి వెంటనే మరమ్మతు చేయాలన్నారు. మురికినీరు బయటికి రాకుండా ఎప్పటికప్పుడు మురుగు తోడాలన్నారు. వార్డులో ఎక్కడెక్కడ మురుగు నీరు బయటికి వస్తుందో అక్కడ వెంటనే బ్లీచింగ్ చేసి పరిశుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్టాంపుల ప్రదర్శన



స్టాంపులను తిలకిస్తున్న విద్యార్థులు

సీతంపేట : నేషనల్ ఫిలాటలీ డే సందర్భంగా హెడ్ పోస్టాఫీస్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయం ఆవరణలో మంగళవారం స్టాంపుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. వివిధ సందర్భాల్లో ప్రత్యేకంగా ముద్రించిన, అరుదైన స్టాంపులను ప్రదర్శనలో ఉంచారు. పౌర గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు ప్రదర్శన తిలకించి స్టాంపుల వివరాలు, ప్రత్యేకత తెలుసుకున్నారు. అక్కినేని శత జయంతి వేడుకల సందర్భంగా ప్రత్యేకంగా ముద్రించిన స్టాంపు, పారిస్ ఒలింపిక్స్, అయోధ్య శ్రీరామ జన్మభూమి టెంపుల్, అగ్రికల్చరల్ గూడ్స్, ఇండియా – ఒమన్ దేశాల మైత్రి, ఇండియా – ఈజిప్ట్ 75 ఏళ్ల మైత్రి సందర్భంగా పోస్టల్ శాఖ విడుదల చేసిన స్టాంప్స్ ఆకట్టుకున్నాయి. ఇక్కడ ప్రదర్శించిన స్టాంపులు వాడుకకు దొరకవని, కేవలం సేకరణకర్తలకు ప్రత్యేక ముద్రిత స్టాంపులు అందజేస్తామని పోస్టల్ సిబ్బంది వెంకటేష్ తెలిపారు. ఏ స్టాంపు ఎప్పుడు విడుదల చేశారు వంటి విషయాలు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు బాగా ఉపకరిస్తాయని తెలిపారు.